క్లుప్తంగా

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

భీమారం: బీఆర్ఎస్ హయాంలోనే చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి చెందిందని మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వెంకటస్వామి కుటుంబం అనేక పదవులు చేపట్టినా.. నియోజకవర్గంపై ఎలాంటి ప్రేమ చూపలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి చెన్నూరు ఎమ్మెల్యేగా బాల్క సుమన్ గెలుపొందిన అనంతరం చెన్నూరుకి అధిక నిధులు తీసుకువచ్చడన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్ తన నియోజకవర్గంలో 40 వేల మంది యువతకి ఉపాధి కల్పిస్తానని చెప్పి ఫ్యాక్టరీలు మాత్రం ఉత్తర భారతదేశంలో ఫ్యాక్టరీలు నెలకొల్పోడని ఎద్దవా చేశారు.

29 నుంచి ‘వికసిత్ కృషి సంకల్ప’

బెల్లంపల్లి: రైతాంగాన్ని అభివృద్ధి చేయడం కోసం ఈనెల 29 నుంచి జూన్ 12 వరకు వికసిత్ కృషి సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞానకేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనలకు అనుగుణంగా ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలు, 100కు పైగా ఐకార్ వ్యవసాయ అనుబంధ పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, అధికారులు బృందాలుగా ఏర్పడి కార్యక్రమంలో భాగస్వాములవుతారని పేర్కొన్నారు. ఆధునిక, ఆదర్శ వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

జన్నారం: మండలంలోని కిష్టాపూర్, రాంనాయక్ తండా, సోనాపూర్ గ్రామాలకు చెందిన పలువురు వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. వారితో పాటు, అనారోగ్యాలతో బాధపడుతున్న కుటుంబాలను ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ గురువారం పరామర్శించారు. కుటుంబాల్లో ధైర్యం నింపి నేనున్నానని భరోసా కల్పించారు. నాయకులు లక్ష్మీనారాయణ, ముజాఫర్ ఆలీఖాన్, మోహన్‌రెడ్డి, శంకరయ్య, ఇందయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా చెట్లు తొలగించవద్దు

కాసిపేట: ప్రజలు చెట్లను తొలగించేటప్పుడు తప్పనిసరిగా అటవీశాఖ అనుమతి తీసుకోవాలని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అటవీశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అనుమతులు లేకుండా చెట్ల నరికితే చట్ట రీత్యా చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామంలో గురువారం విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన గాదర్ల నరేశ్‌కు చెందిన గేదె మేత మేస్తున్న క్రమంలో డీటీఆర్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఒక్కసారిగా అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.30 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

టిప్పర్ బోల్తా

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌కే1ఏ పాలవాగు వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొగ్గు లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ వాగులో బోల్తా పడింది. మందమర్రి నుంచి ఆర్‌కేపీ వైపు వస్తున్న టిప్పర్ ఎదురుగా వేగంగా వచ్చిన కారును తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి వాగులో పడినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే టిప్పర్ బోల్తా పడిందని ఘటనలో టిప్పర్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సరస్వతి పుష్కరాలకు తరలిన భక్తులు



పుష్కరాలకు తరలివెళ్తున్న భక్తులు

చెన్నూర్: కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు గురువారం ప్రారంభమయ్యాయి. పుష్కర స్నానాలు ఆచరించేందుకు చెన్నూర్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ అధికారులు 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. బస్సుల అందుబాటులో ఉండడంతో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరంగా బస్సులు రాకపోకలు సాగించాయి. కాళేశ్వరం పుష్కరాలకు 30 బస్సులు కేటాయించడంతో మంచిర్యాలకు వెళ్లే బస్సుల కొరత ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

ఉత్సాహంగా సమ్మర్‌క్యాంప్

- యోగా, డ్రాయింగ్, డ్యాన్స్, స్పోకెన్ ఇంగ్లిష్
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక శిబిరం
- 15 రోజుల పాటు శిక్షణ



డ్రాయింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు



యోగా నేర్చుకుంటున్న విద్యార్థినులు

లక్సెట్టిపేట: ప్రభుత్వం వేసవి సెలవుల్లో విద్యార్థుల భవిష్యత్ కోసం సమ్మర్‌క్యాంప్‌లు నిర్వహిస్తోంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు పాఠశాలలో ఆరో తరగతి నుంచి తొమ్మిదోవ తరగతి విద్యార్థులకు సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నారు. ఒక్క పాఠశాల నుంచి 50 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థులకు వివిధ రకాల నైపుణ్యాలు అందించేందుకు ఆహ్లాదంగా ఉండేందుకు ఉదయం ఏడు గంటల నుంచి 10 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ప్రతీరోజు ఆసక్తితో హాజరవుతూ.. పలు అంశాలను నేర్చుకుంటున్నారు. విద్యార్థులకు కొత్త పద్ధతులతో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు.

నాలుగు రకాల బోధనలు..

విద్యార్థులకు సమ్మర్ క్యాంపును ఈనెల 2న ప్రారంభించారు. 15 రోజుల పాటు నిర్వహిస్తారు. యోగా, డ్రాయింగ్, డ్యాన్సింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులను అందిస్తున్నారు. యోగాతో విద్యార్థులకు మంచి ఆరోగ్యం కలుగుతుంది. డ్రాయింగ్ నేర్చుకోవడంతో విద్యార్థులు నైపుణ్యాన్ని కలిగిస్తారు. డ్యాన్స్ నేర్చుకోవడంలో విద్యార్థులు ఆసక్తిని చూపుతున్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ ద్వారా విద్యార్థులు ప్రస్తుతం ఆంగ్లంలో మాట్లాడేందుకు ఉపయోగపడుతుంది. విద్యార్థులలో పలు రకాల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇట్టి పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. వేసవి శిబిరం ద్వారా మంచి అవకాశాన్ని కల్పించిందని విద్యార్థులు వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, ఫ్యాన్, యోగా మ్యాట్‌లు అందిస్తున్నారు. వేసవి శిబిరం మంచి ఉపయోగకంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు.

యోగా నేర్చుకుంటున్నాను



ప్రతీ రోజు ఉదయం వచ్చి పాఠశాలలో యోగా నేర్చుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది. డ్యాన్స్ కూడా ఉపయోకరంగా ఉంటుంది. వేసవి కావడంతో ప్రతిరోజు పాఠశాలకు వచ్చి అన్ని అంశాలు నేర్చుకుంటున్నాను.

– కీర్తసాయి, 5వ తరగతి, విద్యార్థిని

డ్రాయిగ్ చాలా ఇష్టం



పాఠశాలకు ప్రతీ రోజు వస్తున్నాను. డ్రాయింగ్ నేర్పుతున్నారు. మంచి బొమ్మలు వేయడం తయారు చేయడం నేర్పిస్తున్నారు. వేసవి కాలం కావడంతో ఫ్రెండ్స్ అందరం ఇక్కడ కలుసుకుంటున్నాము. సంతోషంగా ఉంది.

– అక్షజ్, 8వ తరగతి, విద్యార్థి

యోగా నేర్పుతున్న



విద్యార్థులకు ప్రతీరోజు యోగా నేర్పుతున్నాను. వేసవిలో ఇలాంటివి తరగతులు నిర్వహించడం సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయడం చిన్నారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. యోగా ద్వారా శారీరకంగా, మానసికంగా ఉపయోకరంగా ఉంటుంది.

– భగవాన్‌దాస్, యోగా మాస్టర్

విరబూసిన మే పుష్పం



నస్పూర్: పట్టణ పరిధిలోని టీఎన్జీవో కాలనీలో నివాసం ఉండే పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ ఇంటిలో మే పుష్పం విరబూసింది. ఈ పుష్పాన్ని సాధారణంగా బాల్ లిల్లీ, బ్లడ్ లిల్లీ అని పిలుస్తారని యోగేశ్వర్ తెలిపారు. స్థానికులు మే పుష్పాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.

17 నుంచి ఆలయ రజతోత్సవాలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాల చెట్టు సమీపంలో గల ఉన్న పంచముఖ అంజనేయ స్వామి ఆలయ రజతోత్సవాలను ఈనెల 17 నుంచి 22 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చక సంఘం అధ్యక్షుడు, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ పూజారి గోవర్ధన గిరి అనంత చార్యులు తెలిపారు. గురువారం స్థానిక పంచముఖ అంజనేయ స్వామి ఆలయంలో ఆలయ పూజారి కృష్ణ కాంత చార్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆలయం నిర్మించి 25 నెలలు పూర్తి అయిన సందర్భంగా రజతోత్సవ కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజల సుఖ సంతోషాల కోసం ప్రత్యేక హోమం, వివిధ పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పల్లెల్లో నిరంతరం విద్యుత్ సరఫరా



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

చెన్నూర్‌రూరల్: పట్టణాలకు ధీటుగా పల్లెలకు విద్యుత్ సరఫరా అందించాలని మంచిర్యాల ఎస్ఈ గంగాధర్ అన్నారు. మండలంలోని కొమ్మెర, ఆస్నాద, పొక్కూరు గ్రామాలలోని సబ్‌స్టేషన్‌లను గురువారం సందర్శించారు. కొమ్మెర సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. దీంతో లోవోల్టేజీ సమస్యలు ఉండవన్నారు. రైతులు, ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అలాగే విద్యుత్ మోటర్ల వద్ద రైతులు కెపాసిటర్లను అమర్చుకోవాలని సూచించారు. పొక్కూరు సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్‌కు స్పెషల్ బ్రేకర్ ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం ఆస్నాద సబ్‌స్టేషన్‌లో ఎస్ఈ, ఏఈలను మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈ ఖైసర్, ఏఈ కేశెట్టి శ్రీనివాస్, లైన్‌మెన్లు రమేశ్‌రెడ్డి, కలగూర రాజమల్లు, ఆస్నాద మాజీ ఉప సర్పంచ్ నస్కూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘అటవీహక్కుల చట్టం అమలులో నిర్లక్ష్యం’



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పాతమంచిర్యాల: పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతుల కోసం ప్రభుత్వం 2006లో ప్రవేశపెట్టిన అటవీ హక్కుల చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు., అటవీహక్కుల చట్టం వచ్చి19 సంవత్సరాలు గడిచినా అమలు కావడం లేదన్నారు. రైతులను ఫారెస్టు అధికారులు బెదిరిస్తున్నారని, సాగు హక్కుపత్రాలు ఉంటేనే భూములు సాగు చేయాలని అంటున్నారన్నారు. జిల్లాలో 11,774 మంది రైతులు 33,417 ఎకరాలలో సాగులో ఉన్నామని సాగు పత్రాల కోసం దరఖాస్తులు చేసుకుంటే కేవలం 1,847 మందికి 3,500 ఎకరాలకే హక్కు పత్రాలు ఇచ్చారని మిగతావి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ప్రకాష్, దుంపల రంజిత్, దాసరి రాజేశ్వరీ పాల్గొన్నారు.

డివైడర్‌పై రెయిలింగ్ ఏర్పాటు



రెయిలింగ్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి అంగడిబజార్, కేకే 2 ఏరియా వరకు ఉన్నటువంటి డివైడర్‌పై రహదారిని దాటకుండా గురువారం ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది పూర్తిస్థాయిలో రెయిలింగ్ ఏర్పాటు చేశారు. గతంలో రోడ్డు పక్కల ఇరువైపులా పలు కాలనీలు ఉండడంతో ప్రజలు అవసరం నిమిత్తం అటు, ఇటు దాటే వారు ఈ క్రమంలో పలు ప్రమాదాలలో చోటు చేసుకున్నాయి. ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఆ ప్రాంతాలను పరిశీలించి డివైడర్‌పై రెయిలింగ్ ఏర్పాటు చేశారు. ప్రజలు ప్రయాణ సమయంలో తమ గమ్యస్థానం చేరాలంటే ఖచ్చితంగా రోడ్డు దాటాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ రెయిలింగ్ ఏర్పాటు చేయడం వల్ల బస్సు దిగితే, మూడు, నాలుగు కిలోమీటర్లు నడువాల్సి వస్తుందని వాపోతున్నారు.

మట్టిని తొలగించరూ..?



నస్పూర్ పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద నర్సయ్యభవన్ ఎదుట జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. ఇటీవల కురుసిన కొద్దిపాటి వర్షానికే మట్టికొట్టుకు వచ్చి రహదారిపై పేరుకుపోతుంది. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీపై నిర్మించిన కట్టడాలను తొలగించి వరద నీరు సక్రమంగా ప్రవహించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. – నస్పూర్

తాగునీటి సమస్య పరిష్కరించండి



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

వేమనపల్లి: మండలంలోని జిల్లెడ గ్రామంలోని ఎస్టీ కాలనీలో తాగునీటి కోసం కాలనీవాసులు అల్లాడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామస్తులు తమ దృష్టికి తీసుకురాగా అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. నెల రోజులుగా తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారని అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులతో కలిసి గురువారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన చేస్తామన్నారు.



పాల్గొన్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

కాసిపేట: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో సత్యనారాయణసింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరలో చేపట్టనున్న వన మహోత్సవం కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు., అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పించాలని, ఎక్కువ వేతనం వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మినారాయణ, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లు భద్రపరుచుకోవాలి

దండేపల్లి: ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగిశాయి కాబట్టి రైతులు తమ పొలాల్లోని వ్యవసాయ బావుల వద్ద ఉన్న వ్యవసాయ మోటార్లను భద్రపరుచుకోవాలని గురువా రం ఎస్సై తహాసీనొద్దీన్ సూచించారు. మోటార్లు చోరీకి గురయ్యే అవకాశం ఉందన్నారు.

‘మున్నూరు కాపులకు మంత్రి పదవి ఇవ్వాలి’

నస్పూర్: మంత్రివర్గ విస్తరణలో మున్నూరు కాపులకు మంత్రి పదవి ఇవ్వాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవన్న డిమాండ్ చేసారు. గురువారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బీసీ సామాజిక వర్గంలో అత్యధిక శాతం జనాభా కలిగి ఉన్న మున్నూరు కాపులకు ఎలాంటి రాజకీయ పదవులను ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. రాజ్యసభ ఎంపీ, ఎమ్మెల్సీ, పలు కార్పోరేషన్ పదవులను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పల్లె భూమేశ్, గొంగళ్ల శంకర్, మైదం రామకృష్ణ, పూదరి కుమార్, రాల్లబండి రాజన్న, బొడ్డు చిన్నయ్య, సమ్మయ్య, కర్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్

జైపూర్: మహిళా సంఘాల సభ్యులు ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాని ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన వార్షిక ప్రిమియం రూ.20లు చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద భీమా వర్తింస్తుందని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ తెలిపారు. జైపూర్ మండలం ఇందారంలో ఐకేపీ, ఇందారం గ్రామీణ బ్యాంకు, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మార్కెటింగ్, క్రిడిట్‌కార్డు మోసాలు, క్యూఆర్ కోడ్ ద్వారా జరిగే మోసాల గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమన్, బ్యాంకు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘పోడు సాగుదారులకు న్యాయం చేయాలి’



వినతిపత్రం అందజేస్తున్న పోడు రైతులు

తాండూర్: పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి కోరారు. గురువారం తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 30 ఏళ్ల నుంచి నిరుపేదలు పోడు భూములు సాగు చేస్తున్నారని, వీరికి భూములు తప్పా మరో ఆధారం లేదన్నారు. అటవీ అధికారులు కొత్తపల్లి గ్రామానికి వెళ్లి పోడు భూములు సాగు చేయొద్దని రైతులను భయపెడుతున్నారని తెలిపారు. వీవీఆర్ కేడీ ప్రసాద్, మాజీ సర్పంచ్ కాపర్తి సుభాష్, పోడు రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న భీమిని ఏడీఏ సురేఖ

నెన్నెల: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని భీమిని ఏడీఏ సురేఖ హెచ్చరించారు. గురువారం నెన్నెల రైతు వేదికలో నెన్నెల, కన్నెపల్లి, భీమిని , వేమనపల్లి మండలాలకు చెందిన ఫెర్టిలైజర్ డీలర్లు , వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనుమతి లేని విత్తనాలు, నిషేధిత రసాయన మందుల అమ్మకాలు చేస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. దుకాణాల్లో విత్తన ప్యాకెట్లు, ఎరువుల నిల్వలు , స్టాక్ రిజిస్టర్‌లు, బిల్లులను అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయాధికారులు సృజన, వీరన్న, ప్రశాంత్, యమున, ఏఈవోలు రాంచందర్, డీలర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అధికారులు

తాండూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తాండూర్ మండల అధికారులు తెలిపారు. గురువారం మండలంలోని గజ్జలపల్లి గ్రామాన్ని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ , ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి సందర్శించారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్, భీమన్న గుడి అభివృద్ధి, నీటి ఎద్దడిని తీర్చాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అనంతరం రేపల్లెవాడ శివారు సర్వే నెంబర్ 19లో ఉన్న వివాదాస్పద భూమిని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ చేసి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ శ్రీనాథ్

దండేపల్లి: మండలంలోని ధర్మారావుపేటలో ఉపాధిహామీ పని ప్రదేశం వద్ద ఎస్‌బీఐ తాళ్లపేట బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కల్పించారు. ఉపాధి హామీ కూలీలకు బ్యాంకు ద్వారా అందించే సేవలు, రుణాలు, భీమా పథకాలు, పొదు పథకాలతో పాటుగా డిజిటల్ సేవలను గురించి బ్యాంకు మేనేజర్ శ్రీనాథ్ వివరించారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.